నియతి: సమవర్తికి ప్రణామం.

సమవర్తి: ఏం నియతీ యిలా చేశావ్? ఒకరిని తీసుకురాబోయి యింకొకర్ని తీసుకొచ్చావ్?

ని: ధర్మనిర్వహణ అంతే ధర్మరాజా. సత్యవర్తనులూ; దయా స్వభావులూ, నిర్మల హృదయులూ- వీరికి లభించే విముక్తే యీ మెకూ లభించింది. ఈమె ప్రాపు లభించినన్నాళ్లూ ఆ అంధుడు తన కెంత అమూల్య చింతామణి లభించిందో గ్రహించలేకపోయాడు. అతడి విముక్తికింకా సమయం రాలేదు. అనుభవం పూర్తికాలేదు. అటువంటి భార్య లేని జీవితం ఎలా ఉంటుందో అతను చవి చూడాలి. దొరికిన పెన్నిధి పోగొట్టుకునేదాకా అది పెన్నిధి అని మానవుడికి తెలియదు. (గంటల చప్పుడు.)

స: ఏమిటా గంటలు నియతీ?

ని: మీ మహిషపు లోహ ఘంటలు స్వామీ!

(ఆలిండియా రేడియో మద్రాసు నుండి ప్రసారితం)

---

కథానిక

# గాయపడ్డ హృదయం

"బదరీనాథ్"

నన్ను చాలామంది అడిగారు. "నువ్వు నీలని యెందుకు ప్రేమిస్తున్నావూ?" అని. "ఏం? ఎందుకు ప్రేమించ గూడదూ?" అని అడిగేవాణ్ణి నేను. "అదికాదు. ఆ రంభని యెలా ప్రేమించగలుగుతున్నావని" వేళాకోళంగా అనేవాళ్లు. "నేను ప్రేమించేది ఆమె హృదయాన్ని గాని, భౌతిక సౌందర్యాన్ని కాదు. అసలు నేనామె భౌతిక సౌందర్యాన్ని ప్రేమించలేను. ప్రేమించినా అది అశాశ్వతం" నాకేసి వెగటుగా చూసి వీడో "తత్వవేత్త" అనుకొనేవారు.

నిజానికి నీల అంత అందమయినది కాదు. కాని అనాకారి మాత్రం అసలు కాదు. అయినా-నీల ఆకార అనాకారాలు నాకనవసరం. నే నామెను ప్రేమిస్తున్నాను. నీల నన్ను ప్రేమిస్తోంది. అయితే మా ప్రేమ అందరిలాంటిది కాదు. అందుకనే మా ప్రేమని అందరూ అర్థంచేసుకోలేరు. అపార్థం మాత్రం అతి సులువుగా చేసుకోగలరు.

ఒకరోజు ప్రొద్దున్నే సుదర్శన్ మా యింటి కొచ్చాడు. వాడు నా కళ్లలోకి తీక్షణంగా చూస్తూ అన్నాడు. "ఏరా? నువ్వు నీలని ప్రేమిస్తున్నావా?" అని. అందర్నీ అడిగినట్లే వీణ్ణీ అడిగాను. "ఎందుకు ప్రేమించగూడదూ?"

ఎందుకు ప్రేమించగూడదో వాడు డజను కారణాలు చెప్పాడు. "నీల అందమయిన పిల్ల కాదు. ఆ అమ్మాయికి సిగ్గులేదు. రోడ్డుమీద కూడా ఆడుతూ పాడుతూ నడుస్తుంది. లీల నెరుగున్న పెద్దవాళ్ళనయినా సరే నడిరోడ్డు మీద నిలేసి పకపకా నవ్వడమే కాకుండా చకచకా మాట్లాడేస్తుంది. ఉత్తి అతివాగుడు మనిషి." నే నన్నాను, "ఆ అమ్మాయి నందుకనే ప్రేమిస్తున్నాను" సుదర్శన్ మరి సమాధానం చెప్పలేక "విరుద్ధ మనస్తత్వం" అని అదోమాదిరిగా చూసి వెళ్ళిపోయేడు. నేను నవ్వాలనుకున్నాను. కాని వాడి అమాయకత్వానికి విచారించాను.

వీడి విషయాన్ని గురించి మీకు కొంత చెప్పాలి.

వాడి దండలు కండలు తిరిగుంటాయ్. అమ్మాయిలచేత ఆకర్షించబడే అంగ సౌష్టవం కోసం ప్రతిదినమూ కసరత్తుచేస్తాడు. ఎప్పుడూ రొమ్ము విరుచుకునే నడుస్తాడు. ఒక విథమయిన అహంభావం మనిషిలో మెదల్తుం

టుంది. తన అందాని కందరూ ముగ్ధులై పోతున్నారనుకొంటాడు. ఫలానా అమ్మాయి తన కుత్తరం రాసిందని ఒకటి సృష్టించి మరీ చూపిస్తాడు. లేకపోతే ఆ అమ్మాయీ, తనూ, కలిసి కథలు వ్రాస్తున్నామంటాడు. దీన్నిబట్టి వాడి మనస్తత్వం మీరే అర్థం చేసుకోండి.

ఆరోజున వాడు మా యింటికొచ్చి నీలని గురించి అడగడంలో అర్థం లేకపోలేదు. అసలు సంగతేమిటంటే - వాడుకూడా నీలని ప్రేమిస్తున్నాడు. నీల యెక్కడ కనిపించినా రొమ్ము మరింత విరుచుకుని నీలకేసి దీనంగా చూసేవాడు. నీల తనకేసి చూసి నవ్వకపోతే చాలా మధనపడేవాడు. తనతో మాట్లాడక పోతే తనే యెదురుగాపోయి మాట్లాడించే వాడు.

మా ముగ్గురిళ్ళూ చాలా దగ్గర్లో వుండేవి. నీల రోజూ మా యింటికే వస్తూండేది. ఇదే సుదర్శన్‌కి కడుపుమంట. వాళ్ళింటికి రమ్మన మని బ్రతిమాలేవాడు నీలని. కాని-నీల మా యింట్లోనే యిరవైనాలుగు గంటలూ గడిపేది. మా స్నేహానికి, మా తల్లిదండ్రు లేమీ అడ్డు పెట్టలేదు. నీల తల్లిదండ్రులున్నూ ఆటంక పరచలేదు. పైగా-మరింత సంతోషించే వారు. నే నేమన్నా అల్లరి పనిచేస్తే అందరెదురు గుండానూ చెడామడా తిట్టేసేది నన్ను. నేనూ అంతే. ఇందులోనే మేం అతీతమైన అను భూతిని పొందే వాళ్ళం. కావాలని నేను నీలకి కోపం తెప్పించేవాణ్ణి. కోపం వచ్చినప్పుడు ఆమె ముఖంలో ప్రస్ఫుటమయ్యే అమాయ కత్వం నన్ను గిలిగింతలు పెట్టేది.

మా యింటి పక్కనే వున్న గుళ్లో నీల తండ్రి పూజారి. నీల తండ్రికి పువ్వులివ్వటానికి వెళ్ళి మాయింటి కొచ్చేస్తుండేది. ఆ రోజున పూజయిపోయినాక గూడా గుళ్ళోనే వుండి పోయింది. పూజవగానే నీల తండ్రి యింటికి వెళ్ళిపోయాడు. ఈ తరుణంకోసమే నిరీక్షిస్తున్న సుదర్శన్ నీల యెదురుగా వెళ్ళి నుంచున్నాడు. ఆమె రెండు చేతులూ పట్టుకుని అన్నాడు, "నీలా! నన్ను పెళ్ళిచేసుకోవూ?" అడగదలచు కున్నది సూటిగా అడిగేశాడు.

నీల నవ్వుతూ అన్నది "నిన్నా... నిన్నా పెళ్ళిచేసుకోటం"

సుదర్శన్ మొహం జేవురించింది. "ఏం? నన్నెందుకు పెళ్ళిచేసుకోగూడదూ? నేను నీకు పనికిరానూ?"

"సరేలే. నిన్నే పెళ్ళిచేసుకుంటాను" చిరు నవ్వుతో అమాయకంగా అంది నీల.

"అయితే ఆ పువ్వు లిటు తే" అన్నాడు నీల చేతులోని పువ్వులు చూపిస్తూ.

"నీ కెందుకీ పువ్వులు? ఎవరికిస్తావ్"

సుదర్శన్‌కి కోపం వచ్చి బలవంతంగా లాక్కోబోయేడు. అంతలోకీ నేనక్కడి కెళ్ళాను. నన్ను చూడంగానే నీల చెయ్యివదలి నాకేసి తీక్షణంగా చూసేడు సుదర్శన్. నన్ను చూడ్డంతోటే నీల పకాపకా నవ్వుతూ అంది, "చూడు బదరీ! నేను సుదర్శన్‌ని పెళ్ళి చేసు కోవాలిట. అందుకు చిహ్నంగా యీ పువ్వు లివ్వాలట" సుదర్శన్ మా ఇద్దరి వేపూ తీక్ష ణంగా చూస్తూ గబగబా వెళ్ళిపోయేడు. నే నెంత ఆగమన్నా వినకుండా తనదార్నిపో యేడు. నిజంగా నాకు నీలమీద, కోపంవచ్చింది. కోప్పడ్డాను. నీల అంది, చూడుమరి ఆ కోతిని పెళ్ళి చేసుకోవాలట"

"సుదర్శన్‌కేం. నువ్వుయేమైనా సరే సుద ర్శన్‌నే పెళ్ళి చేసుకోవాలి. అంతకంటే నీకు తగిన భర్త యెక్కడ దొరుకుతాడూ?"

నీల నా కళ్ళల్లోకి ఒక్కసారి 'సీరియస్'గా చూసింది. ఇది జీవితానికి సంబంధించిన ప్రశ్న గాని మరోటిగాదు.

"నిజం చెప్పు. నేను సుదర్శన్‌ని పెళ్ళిచేసు కోవటం నీ కిష్టమేనా?"

"హృదయపు లోతుల్లోంచి చెపుతున్నా, నీలా నువ్వు వాణ్ణి పెళ్ళి చేసుకో"

"అయితే ఈపువ్వులు సుదర్శన్ కిచ్చిరా."

అవి తీసుకుని సుదర్శన్ యింటికి బయలు దేరాను. తలుపు తీయంగానే మొహం చిట్లించు కుంటూ అడిగాడు.

"ఎందుకొచ్చావ్ మా యింటికి?"

"ఈ పువ్వులు నీల నీ కిమ్మంది తీసుకో!"

"దాని మొహాన్నే కొట్టు. నా కక్కర్లేదా వెధవ పువ్వులు"

వచ్చిన కోపాగ్ని గుండెల వెనకాలే అదిమి పట్టుకున్నాను.

"చాలా తప్పుగా మాట్లాడుతున్నావ్ సుదర్శన్. నీలని నువ్వు అర్థం చేసుకోలేక పోయావు. నీల చాలా అమాయకురాలు. ఆమె నీకిన్న హృదయం ఈ ప్రపంచంలో మరెవ్వరికన్నా లేదు. ఈ పూలు తీసుకో!"

"నాకేమీ నువ్వు చెప్పక్కర్లేదు. ముందిక్కణ్ణించి కదులు."

"అలా కాదు. నీల నీ కాబోయే భార్య. ఇవిగో తీసుకో"

అమాంతం నా చేతులోంచి తీసుకుని నేలని విసరికొట్టి కాళ్ళతో రాసేసాడు ఆ పువ్వుల్ని. నేనా దృశ్యం చూడలేక పోయేను. నిమీలితంగా వున్న నా కనుకొలకుల్లోంచి రెండు కన్నీటి బిందువులుజారి ముక్కలయిన పువ్వుల్ని తడిపినయ్. ఒక్కక్షణం అక్కడుండకుండా ఇంటికొచ్చేశాను. ఏమనుకున్నాడో నా వెనకాలే సుదర్శన్ వచ్చి క్షమించమని బ్రతిమాలేడు. సుదర్శన్ కోపం క్షణికమే అయినందుకు చాలా సంతోషించాను. తర్వాత నీల నన్ను ఆదుర్దాతో అడిగింది. "ఆ పూలు తీసుకున్నాడా?" అని.

"ఆఁ" అని బరువుగా అనగలిగాను.

"నడు నీలా. మీ నాన్నగారితో మాట్లాడతాను" నీలమాత్రం అక్కడే వుండిపోయింది. నీలయింటికి వెళ్లాను నేను.

*　　*　　*

మూడురోజుల తర్వాత నీల మాయింటికి పరుగెత్తుకుంటూ వచ్చింది. రెండుచేతుల్తోనూ యేదో మూసి దాన్ని వెనకాలే దాచేసింది. చూపించమన్నాను. "ఊహుఁ" బుర్ర అడ్డంగా తిప్పింది. బలవంతంగా చేతులోంచి లాక్కుని మరీ చూసేను. అది శుభలేఖ, నీలకీ-సుదర్శన్‌కీ పెళ్ళి. అప్రయత్నంగా నా చెయ్యి నీల తలని నిమిరింది. ఆమె వంగి నా కాళ్ళకి నమస్కారం చేసింది. రెండానంద భాష్పాలు ఆమె తలమీద పడినయ్. అవే ఆమెకు నా ప్రేమపూర్వక ఆశీర్వచనాక్షతలు.

సిగ్గుబరువుతో తల వంచుకునే పరుగెత్తుకుని వెళ్ళిపోయింది.

మర్నాడు మాయింటికి నా స్నేహితబృందం అంతా కొట్టుకొచ్చింది. అంతమందినీ ఒక్కసారి చూసి ఆశ్చర్యపోయేను. వాళ్లున్నూ నాకేసి చూసి ఆశ్చర్యపోయి ఒకళ్ల మొహాలకేసి ఒకళ్లు చూసుకుంటున్నారు. నాకేమీ అర్థం కాలేదు. తర్వాత వాళ్లు నన్నడిగారు.

"ఏమిరా! నువ్వు నూతిలోపడిగాని, కొండమీంచి దూకిగాని, విషం పుచ్చుకుని గాని-యింకా ఆత్మహత్య చేసుకోలేదేం" అని. నేను పుట్టింతర్వాత యెప్పుడూ గూడా అల్లా నవ్వలేదు. కాని ఆరోజున-.ఆసమయంలో నవ్వాను. మళ్ళీ- అందరూ నాకేసి ఆశ్చర్యంగా చూసేరు. అందరికేసీ చూస్తూ నేనన్నాను,

"ఏం? ఎందుకూ ఆత్మహత్య చేసుకోవడం?"

"ఎందుకేమిటీ? మరి నీల నీకు దక్కకుండా సుదర్శన్‌గాడు కొట్టుకుపోయేడుగా మరిది నువ్వు భరించగలవా?"

ఇందాకటికంటే యిప్పుడు గట్టిగా నవ్వేను.

"ఇదా మీ అనుమానం. మీరు వట్టి పిచ్చి వాళ్లు. మీరు మా ప్రేమని అర్థం చేసుకోలేదు. మాయిద్దరి ప్రేమలోనూ అన్నా చెల్లెళ్ల ప్రేమ దాక్కునివుంది. ఇది మీరు మీహృదయాల్తో చూడాలి. కాని మీ హృదయాలకా శక్తి లేదు. ఈనాటికైనా మమ్మల్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి."

"కోయ్‌నా సామిరంగా. అసలది నీకు దక్కలేదు. అందుకనే యీ వేదాంతం పుట్టుకొచ్చింది. అయినా- అందని ద్రాక్షపళ్లు పులుపు గదురా! ఇవన్నీ ఎవరికి తెలియని సంగతులురా బాబూ! అయినా- మాకెందుకులే. ఇంతకీ- సుదర్శన్ అదృష్టవంతుడు" అంటూ అందరూ ఓమందలా వెళ్ళిపోయేరు. నాకు గట్టిగా నవ్వొచ్చింది, "అమాయకులు" అని మనస్సులోనే అనుకున్నాను. నన్ను వెక్కిరించడం, పరామర్శించడం అయాక- సుధర్శన్‌నీ, వాడి శక్తినీ, వాడి అదృష్టాన్నీ శ్లాఘించటానికి వెళ్ళారు వీళ్ళంతాను. వాడు అందరికీ పార్టీ యిచ్చాడు. వాళ్లన్నారు : "నువ్వు చాలా అదృష్టవంతుడివిరా. బదరీగాడి నోట్లో బెడ్డ కొట్టేశావ్. వాడిప్పుడు బాగా యేడుస్తున్నాడులే. పైగా వేదాంతి గూడాఅయ్యేడు."

సుదర్శన్ నవ్వుతూ- "ఏడిశారు. మా పెళ్ళికి ముఖ్యంగా ప్రయత్నంచేసింది వాడే" ఆమాట వినేటప్పటికందరూ మారు మాట్లాడకుండా వెళ్ళిపోయారు. నీలకీ-సుదర్శన్‌కీ పెళ్ళి వైభవంగా జరిగింది. నేను చాలా గర్వపడ్డాను, నీల మంచి భర్తని సంపాదించుకుందని.

పెళ్ళయిన నెల్లోనే సుదర్శన్‌కి మరో ఊళ్ళో ఉద్యోగమయింది. కుటుంబంతో సహా అక్కడికే వెళ్ళిపోతున్నాడు. ఆరోజున నీల మా యింటికొచ్చింది.

"వెళ్తున్నా బదరీ" అని చెపుతున్నప్పుడు ఆమె కళ్ళు నీళ్ళతో నిండినయ్. చంటిపిల్లలా యేడవడం మొదలెట్టింది. దగ్గిరికి తీసుకుని తలనిమురుతూ ఓదార్చాను. అదే సమయంలో సుదర్శన్ అక్కడికొచ్చాడు. మమ్మల్ని చూడ్డంతోనే కోపం పట్టలేక నీల చెయ్యి పట్టుకుని గబగబా లాక్కెళ్ళిపోయేడు. అప్పుడు నీల నాకేసి దీనంగా చూసింది. ఆ చూపులు నా గుండెల్లో బాకుపోట్లు. ఏమైనప్పటికీ - చెల్లెల్నత్తగారింటికి పంపి చేతులు దులుపుకున్న అన్న పొందే అనుభూతి పొంద గలిగాను. కాని నీలతో వియోగం, నాలో పెద్ద మార్పు తీసుకొచ్చింది.

మరి కొన్ని రోజులకి నాకూ పెళ్ళయింది. నాకు జతగా - నా బాధ మర్చిపోయేందుకు మరో హృదయం దొరికింది. కాని అది నీల హృదయంలాంటిది మాత్రం కాదు. వట్టి అనుమన పిశాచం.

మూడేళ్ళ తర్వాత సుదర్శన్ తిరిగీ మా ఊరొచ్చాడు. నేను వీధిలోనే నిలబడి చూస్తున్నాను. నలుగురు మనుష్యులు బండిలోంచి నీలని యెత్తుకుని యింట్లోకి తీసుకువెళ్తున్నారు. నా కళ్ళు నీలని అలా చూస్తాయని యెప్పుడూ అనుకోలేదు. సుదర్శన్ డాక్టర్ కోసంగాబోలు. అలా వెళ్ళేడు. నేను మరక్కడుండలేక పోయేను గబగబా అక్కడికే పరుగెత్తాను. నీల తలిదండ్రులు మాత్రమే అక్కడున్నారు. దగ్గరగా వెళ్ళి "నీలా" అని గాద్గదికంగా పిల్చాను. ఆమె కళ్ళు తెరిచి చూసింది. లేచి కూర్చోబోయి పడిపోయింది. నా కళ్ళ నీళ్ళు ధారగా ప్రవహిస్తున్నై. నీల నా కళ్ళల్లోకి చూస్తూ అంది. "ఆయనకి నేనొక్కర్తెనే అనుకున్నాను. కాని - నాలాంటి వాళ్ళు చాలామంది తయారయ్యేరు. వాళ్ళందరి చీమూ-రక్తమూ నాలో యెక్కించారు. ఇప్పుడు నా పరిస్థితిల్లావుంది." పరిస్థితి నాకు పూర్తిగా అర్థమైంది. నాలో ధైర్యం నశించింది. ఆమె గుండెలమీద తలపెట్టి ఘోరంగా యేడ్చాను. అప్పుడే డాక్టర్‌తో సహా వచ్చాడు సుదర్శన్. ఈసడిస్తూ నన్నివతలకి లాగేశాడు. నాకోసం లేచి తిరిగి పడిపోయింది నీల. డాక్టర్ ఆమెనుపరీక్షించి, "నీల యిక మీకులే" దన్నాడు. రెండు చేతుల్తోనూ ముఖం కప్పుకుని భోరున యేడ్చాను. అక్కడున్న వాళ్ళందరికోసమూ సుదర్శన్ బిక్కమొహం పెట్టాడు. వెనకాలే మా ఆవిడొచ్చి నానాచీవాట్లూపెడుతూ నన్నింటికి లాక్కెళ్ళిపోయింది.

ఆ రోజున నిజంగా చచ్చిపోయింది నీల కాదు. నేను. నీల అమరజీవి. ఆనాటికీ - యీనాటికీకూడా మా ప్రేమని యెవ్వరూ అర్థంచేసుకోలేక పోయేరు. సుదర్శన్ అర్థంచేసుకోలేదు. మా ఆవిడా అర్థం చేసుకో లేకపోయింది. స్నేహిత బృందమా - అసలు హృదయమేలేనిదైంది. నిజమైన ప్రేమని ఖూనీ చేసేందుకు చాలా మంది వుంటారని ఆనాడు గ్రహించాను.

నెలతిరక్కుండానే సుదర్శన్ యింట్లోంచి బాండు మేళం వినిపించింది. నీల స్థానం మరో స్త్రీ ఆక్రమిస్తోందని తెలుసుకున్నాను. మగవాళ్ళకి స్త్రీల లోటు లేదని నిరూపించాడు సుదర్శన్. ఈ పెళ్ళికి నీల హృదయం యేడుస్తుంది. తనకోసంకాదు. తన స్థానాన్ని ఆక్రమిస్తున్న స్త్రీకోసం. కాని ఆ బాండు మేళం రొదలో ఆమె యేడుపు వినిపించలేదు.

